క్లుప్తంగా

నియామకం



నియామకపత్రం అందుకుంటున్న నర్సింహయాదవ్

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామానికి చెందిన పసుల నర్సింహయాదవ్ బీజేపీ ఓబీసీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియామకమయ్యారు. ఈ మేరకు ఓబీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ సోమవారం నర్సింహయాదవ్‌కు నియామకపత్రం అందించారు. గ్రామాల్లో బీజేపీ బలోపేతానికి తనవంతు కృషిచేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ ఉపాధ్యక్షులు పాపయ్యగౌడ్, కుమ్మరి మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా 111 జీఓ పరిధిలోకి రాదు

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి

మొయినాబాద్: రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లోని చెరువులు, నాలాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ ఏర్పాటు చేసిన హైడ్రా 111 జీఓ పరిధిలోకి రాదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కీసరి సంజీవరెడ్డి అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. హైదరాబాద్‌లోని చెరువుల ఎఫ్‌టీఎల్‌లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను హైడ్రా అధికారులు కూల్చివేస్తుంటే 111 జీఓ పరిధిలోకి కూడా హైడ్రా అధికారులు వస్తారని కొన్ని మీడియా సంస్థలు అసత్య ప్రచారం చేస్తున్నాయన్నారు. దీంతో 111 జీఓ పరిధిలో ఉన్న సామాన్య ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. హైడ్రా 111 జీఓ పరిధిలోకి వెళ్లదని.. దీంతో మాకు సంబంధం లేదని.. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారని గుర్తు చేశారు. 111 జీఓ ఎత్తి వేయాలనే ఇంతకాలం పోరాటం చేశామన్నారు. 111 జీఓపై ప్రభుత్వానికి స్పష్టమైన అవగాహన ఉందన్నారు. ఈ ప్రాంతంలోని ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావొద్దన్నారు. కొన్ని మీడియా సంస్థలు చేసే తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దన్నారు.

రైల్వే క్రాసింగ్ మూసివేత

కొత్తూరు: పట్టణ సమీపంలోని ఎస్సీ కాలనీ వద్ద ఉన్న రైల్వే క్రాసింగ్‌ను ఈ నెల 27 నుంచి 29వ తేదీ రాత్రి 9 గంటల వరకు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. ఈ మేరకు వారు మున్సిపల్, పోలీస్‌స్టేషన్‌కు లేఖ అందించారు. రైలు పట్టాల మరమ్మతుల కారణంగా క్రాసింగ్‌ను మూసివేస్తున్నట్లు తెలిపారు. క్రాసింగ్ గుండా ప్రయాణించే వాహనదారులు, ప్రజలు తమకు సహకరించాలని కోరారు.

ఘనంగా మైసమ్మ బోనాలు



కొందుర్గులో అమ్మవారికి పూజలు చేస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన శేరీల మైసమ్మ బోనాల ఉత్సవాలు కనుల పండువగా సాగాయి. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ప్రత్యేకాకర్షణగా నిలిచాయి.

వైభవంగా మల్లన్న బోనాలు



బోనాల ఊరేగింపు

షాబాద్: మండల పరిధిలోని ముద్దెంగూడ గ్రామంలో మల్లన్న బోనాల ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మహిళలు బోనాల ఊరేగింపుగా మల్లన్న ఆలయానికి చేరుకొని మొక్కులు చెల్లించారు. శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు, యువకుల కేరింతలతో గ్రామంలో సందడిగా మారింది. కార్యక్రమంలో ముద్దెంగూడ మాజీ సర్పంచ్ కుర్వ జయమ్మ, మాజీ ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్య, సుదర్శన్, నర్సింలు, సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

రాఘవేందర్‌కు ఘన సన్మానం

కడ్తాల్: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల రాఘవేందర్‌ను సోమవారం మండల కేంద్రంలో రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్ నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతునాయక్, మాజీ సర్పంచ్ హరిచంద్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రమేశ్, నాయకులు లాయక్‌అలీ, రమేశ్, మహేశ్, రామకృష్ణ, అంజి, గోపాల్, రాజు ఉన్నారు.

- ఆయా గ్రామాల పూర్తి వివరాలు సేకరణ
- ఉన్నతాధికారుల ఆదేశాలతో ప్రతిపాదనలు సిద్ధం
- నివేదికలు తయారుచేస్తున్న మండల అధికారులు
- మండలంలో ప్రస్తుతం 37 పంచాయతీలు

పంచాయతీల ఏర్పాటుకు కసరత్తు



ఊరెళ్ల గ్రామ పంచాయతీ కార్యాలయం

చేవెళ్ల: పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం సన్నద్ధం అవుతుండటంతో ముందుగానే గ్రామాల వివరాలు సేకరించే పనిలో అధికారులు ఉన్నారు. ఎన్నికలకు ముందే కొత్త పంచాయతీల ఏర్పాటుకు గ్రామాలకు సంబంధించిన ప్రతిపాదనలను ఉన్నతాధికారులు కోరటంతో మండల అధికారులు కసరత్తు ప్రారంభించారు. దీంతో చేవెళ్ల మండలంలో మరో 8 కొత్త పంచాయతీల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనల ఫైల్స్‌ను సిద్ధం చేసి పంపించారు. వీటిలో ప్రభుత్వం అధికారులు అర్హతలను బట్టి ఎన్ని కొత్త పంచాయతీలను ప్రకటిస్తారో చూడాల్సి ఉంది. పంచాయతీ ఎన్నికలకు ముందే ఈ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండటంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో మండల అధికారులు ఈ నివేదికలను సిద్ధం చేసి పంపిస్తున్నట్లు తెలుస్తోంది.

మండలంలో 37 పంచాయతీలు

చేవెళ్ల మండలంలో ప్రస్తుతం 37 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అర్హతలు ఉన్న అనుబంధ గ్రామాలను, తండాలను పంచాయతీలుగా మార్చిన విషయం తెలిసిందే. అయితే అప్పట్లో అనుబంధ గ్రామాలు పంచాయతీలు కావాలని కోరకముందే అర్హతలను బట్టి ఈ ప్రక్రియ జరిగిపోయింది. దీంతో చేవెళ్ల మండలంలో అప్పట్లో 7 కొత్త పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో 30 పంచాయతీలు కాస్తా 37 పంచాయితీలుగా మారాయి. ఇప్పుడు కొత్తగా మరో ఎనిమిది కొత్త జీపీలకు ప్రతిపాదనలు పంపించారు. వీటి చేరికతో మండలంలో 45 పంచాయతీలు మారుతాయి. మండలంలో కొన్ని అనుబంధ గ్రామాల ప్రజలు మా గ్రామం కూడా పంచాయతీ కావాలనే డిమాండ్‌లను వినిపిస్తూ వస్తున్నారు. దీంతో వారి వినతులను గుర్తించి ఆయా గ్రామాల అర్హతలకు సంబంధించిన వివరాలతో కూడిన నివేదికలు, గ్రామాల మ్యాపులు, భూము ల సర్వే నెంబర్లు, వనరులు తదితర వాటికి సంబంధించిన వివరాలను సేకరించి మండల అధికారులు నివేదికలను ఉన్నతాధికారులకు పంపించారు.

ప్రతిపాదనలు పంపిన గ్రామాలు ఇవే

మండలంలో కొత్త పంచాయతీలుగా ప్రతిపాదనలో ఉన్న గ్రామాలు ఆలూరు అనుబంధ గ్రామమైన ఎంకన్నగూడ, అల్లవాడ అనుబంధ గ్రామమైన జాలగూడ, గొల్లపల్లి అనుబంద గ్రామం ధర్మసాగర్, తలారం అనుబంధ గ్రామం దుద్దాగు, తంగడపల్లి అనుబంధ గ్రామం మడికట్టు. కందవాడ అనుబంధ గ్రామం నారాయణదాస్‌గూడ, ఊరేళ్ల అనునబంధ గ్రామం మొండివాగు, చనువెళ్లి అనుబంధ గ్రామం ఇక్కారెడ్డిగూడలు ఉన్నాయి. మండలంలో ఇంద్రారెడ్డి నగర్, నౌలయపల్లి, లక్ష్మిగూడ, సాయిరెడ్డిగూడ, ఎర్రోని కోటాల గ్రామాలు మాత్రమే అనుబంధ గ్రామాలుగా మిగలనున్నాయి.

ప్రతిపాదనలు పంపాం



మండలంలో కొత్త పంచాయతీలు కావాలనే ప్రజల వినతుల నేపథ్యంలో వాటికి సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాలతో నివేదికలను సిద్ధం చేసి పంపించాం. ఎనిమిది అనుబంధ గ్రామాలకు సంబంధించిన సర్వే నంబర్లు, మ్యాపులు, తదితర వాటిని పంపించాం. ఎన్ని పంచాయతీలు అనేది ప్రభుత్వం, ఉన్నతాధికారులు ప్రకటిస్తారు. మండలంలోని మడికట్టు, దుద్దాగు, ఇక్కారెడ్డిగూడ, ధర్మసాగర్. నారాయణదాస్‌గూడ, జాలగూడ, మొండివాగు, వెంకన్నగూడ గ్రామాలకు సంబంధించి వివరాలు పంపించాం. ప్రస్తుతం వార్డుల వారీగా ఓటరు జాబితాలను సిద్ధం చేసే పనిలో ఉన్నాం.

– విఠలేశ్వర్‌జీ, ఎంపీఓ, చేవెళ్ల

సమస్యల పరిష్కారానికి చర్యలు



శంకర్‌పల్లిలో కుక్కలను తరలిస్తున్న బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు



చెత్తను శుభ్రం చేసిన తర్వాత బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మున్సిపాలిటీలోని 11, 14, 15 వార్డుల్లో వీధి కుక్కలను బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు ఏబీసీ(యానిమల్ బర్త్ కంట్రోల్), ఏఆర్‌వీ(యాంటీ రేబీస్ వ్యాక్సిన్) కోసం హైదరాబాద్‌కు తరలించారు. వాటికి చికిత్స పూర్తయిన తర్వాత మళ్లీ తిరిగి పట్టణంలోనే వదిలేస్తారు. చికిత్స పొందిన కుక్కలు కరిస్తే రేబీస్ వ్యాధి రాదని, అదే విధంగా కుక్కల సంతానోత్పత్తి తగ్గుతుంది. దీని కోసం బ్లూక్రాస్ సొసైటీతో మున్సిపాలిటీ వారు ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే.

చెత్త తొలగింపు

మున్సిపాలిటీలోని 3వ వార్డులో చెత్త, చెదారం ఇష్టారీతిన పడేస్తున్నారని, పాయింట్ల వద్ద చెత్త సేకరణ సరిగా జరగడం లేదని పలువురు కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, ఆయన సోమవారం సిబ్బందిని పంపి చెత్తను శుభ్రం చేయించారు. అనంతరం బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

ఉత్సవాలకు అనుమతులు తప్పనిసరి

పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి

పట్టణ సీఐ విజయకుమార్



షాద్‌నగర్‌రూరల్: మాట్లాడుతున్న పట్టణ సీఐ విజయకుమార్

షాద్‌నగర్‌రూరల్: ప్రజలందరూ కులమతాలకతీతంగా పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని, విగ్రహాన్ని ప్రతిష్ఠించే ప్రతి గణేశ్ మండలివారు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని పట్టణ సీఐ విజయకుమార్ సూచించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ విజయకుమార్ ఆధ్వర్యంలో వినాయక మండప నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వినాయక విగ్రహాన్ని ప్రతిష్ఠించే ప్రతి గణేశ్ మండలివారు తప్పనిసరిగా పోలీస్‌శాఖ నుంచి ముందుగా ఆన్‌లైన్‌లో లింకుద్వారా దరఖాస్తు చేసుకొని అనుమతులను తీసుకోవాలన్నారు. రహదారులకు అడ్డంగా విగ్రహాలను ప్రతిష్ఠించొద్దని, వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదన్నారు. గణేశ్ మండపాలలో విద్యుత్ సరఫరా కోసం సంబంధిత శాఖ అధికారులతో అనుమతులు తీసుకొని, విద్యుత్‌శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలను తీసుకోవాలన్నారు. మండలపాల వద్ద ఉండే వలంటీర్లు తప్పనిసరిగా ఫొటో గుర్తింపు కార్డును ధరించేలా చూసుకోవాలన్నారు. మండపాల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, మండపాల్లో అసాంఘిక కార్యకలాపాలను నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. భారీశబ్దంతో కూడిన డీజే సౌండ్, పెద్ద పెద్ద స్పీకర్లను పెట్టొద్దని తెలిపారు. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, ప్రార్థనా మందిరాల వద్ద ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. మండపాల్లో అగ్ని ప్రమాదాలు జరగకుండా ఇసుక బకెట్లు, అగ్నిమాపక నిరోధక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎలాంటి ఇబ్బంది కలిగినా వెంటనే 100కు డయల్ చేయాలని తెలిపారు. రాత్రి సమయాల్లో పెట్రోలింగ్‌కు వచ్చే పోలీసులకు మండప నిర్వాహకులు సహకరించాలన్నారు. సమావేశంలో ఎస్‌ఐలు బలరాం, సుశీల, రాంచందర్, ఏఎస్‌ఐలు, పోలీసలు సిబ్బంది, మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై కృష్ణయ్య సూచించారు. సోమవారం కొందుర్గులో పీస్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కులమతాలకతీతంగా అందరూ సోదరభావంతో పండుగల్లో పాల్గొని విజయవంతంగా పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా జరుపుకోవాలి

షాబాద్: రానున్న వినాయక చవితి, మిలాద్ ఉన్ నబీ పండుగలను కులమతాలకతీతంగా శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని షాబాద్ సీఐ కాంతారెడ్డి పేర్కొన్నారు. సోమవారం షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక ఉత్సవ నిర్వాహకులు అన్ని వివరాలతో పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది గతంలో కంటే ఎక్కువ విగ్రహాలు ప్రతిష్ఠించే అవకాశం ఉందన్నారు. మండపాల వద్ద నిర్వహణ కమిటీ సభ్యులు అందుబాటులో ఉండాలని, విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మహేశ్వర్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల నాయకులు, సంఘాల నాయకులు తదితరులు ఉన్నారు.

అతి వేగం ప్రమాదకరం

తలకొండపల్లి: అతి వేగం కారణంగానే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ అన్నారు. మండల కేంద్రానికి చెందిన వేణు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన జ్ఞాపకార్థంగా వేణు సోదరుడు సుదర్శన్ నాలుగు వేగ (నియంత్రిక) నిరోధక బోర్డులను పోలీసులతో కలిసి మండల కేంద్రంలో సోమ వారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నర్సి ంహ మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు అతి వేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, డ్రైవింగ్ చేస్తున్న సమయంలో మొబైల్‌ను వినియోగించడం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనల వలన జరుగుతున్నాయని పేర్కొన్నారు. నిధానంగా వెళ్లినట్లయితే అందరికీ మేలని సూచించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లలిత, శేఖర్, పాండు, దశరథం, శ్రీశైలం, రమేష్, రఘువరన్, నితీష్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రుణమాఫీని అర్హులైన రైతులందరికీ అందించాలని, అధికారులు సమన్వయంతో పూర్తి సమాచారాన్ని సేకరించి రైతుల సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వ్యవసాయశాఖ అధికారులతో రుణమాఫీపై ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల కష్టాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం రుణమాఫీని అమలు చేస్తోందన్నారు. అందులో భాగంగా అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ చేయడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. కొందరు రైతులు తమకు రుణమాఫీ జరగలేదని చెబుతున్నారన్నారు. వ్యవసాయశాఖ అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో పూర్తి సమాచారాన్ని సేకరించి అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రుణమాఫీ అమలులో ఏమైనా సాంకేతిక సమస్యలు వచ్చినట్లయితే వాటిని పరిష్కరించాలని, సమస్యల పరిష్కారంలో మీ పరిధి దాటితే ఉన్నతాధికారులకు నివేదికను అందించాలని సూచించారు. రుణమాఫీ అందని రైతులు తమ దరఖాస్తులను మండల వ్యవసాయ(ఏఓ) అధికారులకు, వ్యవసాయ విస్తరణ(ఏఈఓ) అధికారులకు అందజేయాలని కోరారు. సమావేశంలో నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, జగదీశ్‌అప్ప, చల్లా శ్రీకాంత్‌రెడ్డి, వీరేశ్, జితేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ అదనపు సంచాలకుడు రాజారత్నం, మండల వ్యవసాయ అధికారులు, మండల విస్తరణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం

షాద్‌నగర్‌రూరల్: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మృతుల కుటుంబానికి అండగా ఉంటూ వారిని ఆదుకుంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొత్తూరు పరిధిలోని చేగూరు ముఖ్య కూడలిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పట్టణంలోని పటేల్‌రోడ్డుకు చెందిన తల్లి కావ్య, కూతురు అనన్య మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్థానిక నాయకులతో కలిసి సోమవారం ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకొని మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదానికి కారణమైన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలన్నారు. మద్యం సేవించి వాహనం నడిపిన డ్రైవర్‌ను, వాహన యజమానిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు చెన్నయ్య, విశ్వం, శ్రీకాంత్‌రెడ్డి, ముబారక్ అలీ, సయ్యద్ ఖాదీర్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని దేవాదాయ ధర్మాదాయశాఖ ఈఓ శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని కోమరబండ గ్రామంలో బుగ్గ రామేశ్వరస్వామి దేవాలయంలో శ్రావణమాసం సోమవారం సందర్భంగా శివపార్వతులకు కల్యాణం, అభిషేకం, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణాల మధ్య శివపార్వతుల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. చుట్టుపక్క గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి కల్యాణంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఏశాల చంద్రశేఖర్, దేవేందర్‌రెడ్డి, రమేశ్‌రావు పంతులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

ఘనంగా గంప జాతర



గరుడ వాహన సేవ నిర్వహిస్తున్న భక్తులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం గంప జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ అర్చకులు వామనాచార్యులు, కన్న పంతులు మాట్లాడుతూ.. ప్రతి ఏడాది శ్రావణమాసం చివరి సోమవారం రోజు ఈ గంప ఉత్సవాలు (గరుడ వాహన సేవలు) చేయటం ఆనవాయితీగా వస్తుందని చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి పూజల్లో పాల్గొనటంతో ఆలయ ఆవరణ సందడిగా కనిపించింది. భక్తులకు ఆలయం వద్ద కావాల్సిన సౌకర్యాలను దేవాలయ ఈఓ నరేందర్ ఏర్పాటు చేశారు. ఈ రోజు ప్రజలు ఉదయాన్నే గ్రామాల నుంచి ఆలయానికి వచ్చి ఇక్కడే స్వామివారి సన్నిధిలో పూజలు చేసుకుంటూ వంటావార్పుతో రోజంతా గడుపుతారని చెప్పారు. ఆలయంలో గరుడవాహన సేవ వైభవంగా నిర్వహించారు. గతంలో భక్తులు ఇళ్ల నుంచి గంపలు ఎత్తుకొని జాతరకు వచ్చి స్వామి సేవలో పాల్గొనే వారని దీంతో ఈ రోజు గంప జాతరగా పిలుస్తున్నామని తెలిపారు.





షాద్‌నగర్‌లో శ్రీకృష్ణుడి వేషధారణలో చిన్నారులు



షాబాద్: నాగర్‌గూడ శ్రీకృష్ణ దేవాలయంలో భక్తుల సందడి

గోవింద.. గోపాల

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నారులు చిన్నికృష్ణుడు, గోపికల వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఇళ్లల్లో ప్రజలు శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పలు గ్రామాల్లో ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీకృష్ణ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీల్లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గోపాల.. గోపాల అంటూ చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.



షాబాద్: శిశుమందిర్ పాఠశాలలో కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు



మొయినాబాద్‌రూరల్: ఎన్కెపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వేషధారణలో చిన్నారులు



షాబాద్: ఏట్ల ఎర్రవల్లిలో గోపిక వేషధారణలో చిన్నారి



చేవెళ్ల: శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



షాబాద్: కక్కులూర్‌లో గోపికలుగా చిన్నారులు



షాబాద్: తాళ్లపల్లిలో గోపిక వేషధారణలో చిన్నారి



కేశంపేట: పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులు